## క్లుప్తంగా...

### బీఎల్‌ఓలకు శిక్షణ తరగతులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఓటర్ల జాబితాను పకడ్బందీగా రూపొందించే ప్రక్రియను ఎన్నికల అధికారులు వేగవంతం చేశారు. శనివారం జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో బూత్ లెవల్ ఆఫీసర్లకు (బీఎల్ఓ) శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు ఓటర్ యాప్‌ను వినియోగించడంపై అవగాహన కల్పించారు. యాప్‌లో సరిగాలేని ఓటర్ల ఫొటోలను తొలగించి కొత్త ఫొటోలు చేర్చడం, బూత్‌ల వారీగా ఇంటి నెంబర్లు యాప్‌లో నమోదై ఉన్నాయా లేవా అన్న అంశాలను పరిశీలించే విధానాలను వివరించారు. శిక్షణ పొందిన బీఎల్ఓలకు సహాయక ఎన్నికల అధికారి హేమలత ఓటర్ల జాబితా స్టేషనరీని అందించారు. ఈ కార్యక్రమంలో సహాయక మున్సిపల్ కమిషనర్లు సంధ్యారాణి, ఒమర్, ఎన్నికల విభాగం ఇన్‌ఛార్జి కే.భుజేందర్‌బాబు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ బలోపేతానికి కృషి


రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాగులూరి సాయిబాబా

చిలకలగూడ: ప్రముఖ పారిశ్రామికవేత్త, సంఘ సేవకుడు, చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్, మాజీ ఎంపీ మల్లురవి, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో శనివారం కలువగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నాగులూరి సాయిబాబా చేరికతో సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటానని, త్వరలోనే కార్యాచరణ ప్రణాళికలు ప్రకటిస్తానని నాగులూరి సాయిబాబా తెలిపారు.

### సోషల్ వర్క్ విద్యలో పరిశోధనలు జరగాలి

రసూల్‌పురా: సమకాలీన సమాజ పరిస్థితులకు అనుగుణంగా సోషల్ వర్క్ విద్యలో పరిశోధనలు జరగాలని ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ. లింబాద్రీ సూచించారు. సికింద్రాబాద్ పీజీ కళాశాలలో సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన సదస్సు శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సదస్సు చరిత్రాత్మకమైన చరిత్ర సంతరించుకుంటుందని అన్నారు. సోషల్‌వర్క్ అధ్యాపకులు సామాజిక స్పృహ తో పాటు అంకితభావంతో కూడిన బోధన చేసినప్పుడు మాత్రమే సోషల్‌వర్క్ విభాగంలో రాణించగలరని సూచించారు.

### పసిపాపం



లాలాపేట: ఓ పసికందు (10–15 రోజులు)ను చెట్ల పొదల్లో వదిలేసిన అమానవీయ ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఉదయం జామై ఉస్మానియా ప్రాంతంలోని అడిగ్‌మెట్ ఫ్లైఓవర్ సమీపంలో చెట్ల పొదల్లో చిన్నారి ఏడుపును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆడ శిశువును చేరదీసి యూసూఫ్‌గూడలోని శిశువిహార్‌కు తరలించారు. కుక్కలు, ఇంకా ఏవైనా జంతువుల చూసినట్లయితే పరిస్థితి దారుణంగా ఉండేదని స్థానికులు వాపోతున్నారు.

### 72 కిలోల గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఆర్‌పీఎఫ్ పోలీసులు రెండు రోజులుగా నిర్వహించిన తనిఖీల్లో 72 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్ స్టేషన్‌లలో నిర్వహించిన దాడుల్లో గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఆర్పీఎఫ్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేబస్మిత చటోపాధ్యాయ బెనర్జీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆపరేషన్ నార్కోస్‌లో భాగంగా ఆర్పీఎఫ్ పోలీసు బృందాలు ఈ నెల 21, 22 తేదీల్లో బలార్షా–సికింద్రాబాద్ వరకు నడిచే రైళ్లు, స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. కాజీపేట చేరుకున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అనుమానాస్పదంగా కనిపించిన ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతోపాటు 28 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో 4 వ ప్లాట్‌ఫామ్‌పై 22 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై నిర్వహించిన తనిఖీల్లో 22 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా ఈ ఏడాదిలో ఇప్పటి వరకు నిర్వహించిన 35 దాడుల్లో రూ.6.79 కోట్ల విలువ చేసే గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని 41 మందిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

## ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**


ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: ఉద్యోగులు అంకితభావం భావంతో సేవలు అందిస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొనడంతో పాటు దేశాభివృద్ధిలో తమవంతు పాత్ర నిర్వహించాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ 7వ రోజ్‌గార్ మేళాలో భాగంగా సికింద్రాబాద్ బోయిగూడ రైల్ కళారంగ్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐటీ, పోస్టల్, బ్యాంకింగ్ వంటి పలు శాఖల్లో ఉద్యోగాలు పొందిన 176 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంలో ఇప్పటి వరకు సుమారు 5 లక్షల మందికి పైగా రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేశామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత పెద్ద మొత్తంలో ఉద్యోగాలు భర్తీ చేయడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా కోటి ఇరవై ఐదు లక్షల మందికి స్కిల్స్ అందించామన్నారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో యువత అన్ని రంగాల్లో రాణించి తమ ప్రతిభ పాటవాలను కనబర్చే విధంగా అనేక అవకాశాలను కల్పిస్తోందన్నారు. ఉపాధి అవకాశాలు పెరగాలంటే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు మన యువత అందిపుచ్చుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం యువత కోసం నైపుణ్యాభివృద్ధిని పెంచుతూ మరో వైపు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి కల్పనకు బాటలు వేస్తుందన్నారు. దేశంలో విద్య, వైద్యం, రక్షణ, పరిశోధన రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా ఆయా రంగాల్లో మరింత పురోగతి దిశగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

## విద్యుత్ కోతలు లేకుండా చేసిన ఘనత కేసీఆర్‌దే

**గెల్లు శ్రీనివాస్ యాదవ్**



మాట్లాడుతున్న గెల్లు శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్: రాష్ట్రంలో విద్యుత్ కోతలకు చోటు లేకుండా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం బేగంపేటలోని ది ప్లాజాలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యుత్ ప్రమాదాల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలక్ట్రికల్ ఇంజినీర్లు సూచించిన నాణ్యమైన పరికరాలను వినియోగించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు చేసే సూచనలు క్షేత్రస్థాయిలో అందరు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు. రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ జనరల్, ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో విద్యుత్ వైర్లు, ఇతర పరికరాలు ఎంతో నాణ్యత కలిగినవై ఉండాలని, ఇండియన్ బ్యూరో ఆఫ్ స్టాండర్డ్స్ ప్రకారమే తయారైన వాటినే ఎలక్ట్రికల్ నిపుణులు వినియోగించాలన్నారు. ఇళ్లు, పరిశ్రమలు మరెక్కడైనా విద్యుత్ వినియోగిస్తున్నప్పుడు నిపుణులతో సలహాలు తీసుకోవాలన్నారు. టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీజీఎం సీహెచ్ చక్రపాణి మాట్లాడుతూ.. భవనాలకు విద్యుత్ భద్రత తప్పనిసరిగా ఉండాలని ఐఎస్ఐ మార్కు ఉన్న విద్యుత్ పరికరాలను వాడాలని సూచించారు. తెలంగాణ లైసెన్సింగ్ బోర్డ్ కార్యదర్శి ఈ. కాంతారావు, తెలంగాణ లైసెన్సింగ్ బోర్డ్ మెంబర్ పి. స్వామిగౌడ్, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. భాస్కర్, తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి, అసోసియేషన్ ప్రతినిధులు మైపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ప్రవీణ్‌రాజు, రంజిత్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

## వర్షానికి కూలిన ఇల్లు



సనత్‌నగర్: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు సనత్‌నగర్ అల్లావుద్దీన్ కోఠిలో ఓ ఇల్లు కూలింది. స్థానికంగా కొన్నేళ్లుగా నివాసముంటున్న మహ్మద్ ఇసాక్ ఇల్లు కూలిపోవడంతో అతని కుటుంబం నిరాశ్రయంగా మారింది. బస్తీ జనరల్ సెక్రటరీ అష్రఫ్ కార్పొరేటర్‌కు సమాచారం ఇవ్వడంతో బాలానగర్ తహసీల్దార్ అలేఖ్య, జీహెచ్ఎంసీ డీఎంసీ మోహన్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, డీఆర్ఎఫ్ సిబ్బంది ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. జరిగిన నష్టానికి వారం రోజుల్లో నష్టపరిహారం చెల్లిస్తామని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో అల్లావుద్దీన్ కోఠి అధ్యక్షుడు కరీంలా, ఫాసిల్, రఫీక్ జాఫర్ పాల్గొన్నారు.

**చిలకలగూడలో కూలిన నాలా స్లాబ్**

చిలకలగూడ: చిలకలగూడ వద్ద నాలా పైకప్పు కూలి పాక్షికంగా ధ్వంసమైంది. శుక్రవారం రాత్రి పెద్ద శబ్దంతో నాలా స్లాబ్ కుప్పకూలడంతో పరిసరవాసులు భయాందోళనకు గురయ్యారు. నాలా పక్కనే ఉన్న తోపుడు బండ్లు, పాన్ డబ్బా నాలాలోకి ఒరిగాయి. డిప్యూటీ స్పీకర్ పద్మారావు ఆదేశాల మేరకు మెట్టుగూడ కార్పొరేటర్ సునీత, బీఆర్ఎస్ నాయకులు తీగుళ్ల కిషోర్‌కుమార్, జలంధర్ రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ సిబ్బంది జేసీబీ సాయంతో నాలాలో పడిన శకలాలను తొలగించి వరదనీరు సాఫీగా పారేలా చర్యలు చేపట్టి బారికేడ్లు ఏర్పాటు చేశారు.

## సర్వేకల్ కేన్సర్‌పై అవగాహన అవసరం


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంఈ రమేష్‌రెడ్డి, రాజారావు

గాంధీఆస్పత్రి: సర్వేకల్ కేన్సర్‌పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి అన్నారు. గాంధీ ఆస్పత్రి, మెడికల్ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో గైనకాలజీ హెచ్ఓడీ ప్రొఫెసర్ సంగీత షా నేతృత్వంలో గాంధీ సెమినార్ హాల్లో సర్వేకల్ కేన్సర్ స్క్రీనింగ్, కాల్పోస్కోపీ అంశాలపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమేష్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో సుమారు 1.24 లక్షల మంది మహిళలు సర్వేకల్ కేన్సర్‌తో బాధపడుతున్నారని, ఇప్పటికే 77,348 మంది మరణించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయన్నారు. సర్వేకల్ కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు, మరణాల శాతం తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, మెడిసిన్ హెచ్ఓడీ వినయ్‌శేఖర్, ఆర్ఎంఓ పద్మ, గాంధీ గైనకాలజీ హెచ్ఓడీ సంగీతషా, ప్రొఫెసర్లు మహాలక్ష్మీ, జానకీ వెల్లంకి, షర్మిల, విజయకృష్ణ పాల్గొన్నారు.



సికింద్రాబాద్‌లోని శ్రీ రాజరాజేశ్వరీ గార్డెన్స్‌లో ఏర్పాటైన కృతి వీవ్స్ అండ్ క్రాఫ్టస్ హ్యాండ్‌లూమ్ వస్త్ర ప్రదర్శనలో బిగ్ బాస్ ఫేమ్ కీర్తి భట్ సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హ్యాండ్లూమ్ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదన్నారు. – కంటోన్మెంట్

### అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

రసూల్‌పురా: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందుల కలగకుండా అధికారులు సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి కోరారు. శనివారం రసూల్‌పురాలోని గన్‌బజార్, నారాయణ జోపిడి సంఘం, గన్‌బజార్ హట్స్ బస్తీల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నారాయణ జోపిడి సంఘం బస్తీలో డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మిస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ప్రధాన డ్రైనేజీ లైన్ బ్లాక్ అయిందని దీంతో గన్‌బజార్ హట్స్‌వాసుల డ్రైనేజీ మురుగునీరు తిరిగి ఇళ్లల్లోకి చేరుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా విద్యుత్ సమస్యలు ఉన్నాయని స్థానికులు చెప్పడంతో విద్యుత్ విభాగం ఏఈకి సమాచారం ఇచ్చి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. వర్షాకాలంలో రెవెన్యూ, బోర్డు శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోర్డు శానిటేషన్ దఫేదార్ సూరి, స్థానిక నేతలు అశోక్ గౌడ్, జబ్బార్, మణికంఠ, యూసఫ్, కిషన్, సాయి పాల్గొన్నారు.

### ఆగస్టు 16 నుంచే ఓయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు

**విద్యార్థుల ఆందోళనకు దిగి వచ్చిన అధికారులు**

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో పీజీ రెండో, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 16 నుంచే నిర్వహించాలని వైస్ చాన్స్‌లర్ ప్రొ డి.రవీందర్ యాదవ్ నేతృత్వంలో శనివారం జరిగిన ప్రిన్సిపాల్స్, సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. గత కొన్ని రోజులుగా పరీక్షలు వాయిదా వేయాలంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు ఎట్టకేలకు ఓయూ అధికారులు దిగి వచ్చారు. విద్యార్థుల అభ్యర్థనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమావేశంలో పాల్గొన్న అధికారులు స్పష్టం చేశారు. ఈ నెల 26, 27 తేదీల్లో ఇంటర్నల్స్, ప్రాక్టికల్స్ పూర్తి చేయాలని, పరీక్షల తేదీలకు అనుగుణంగా సెలబస్ పూర్తి చేసుకోవాలని ఓయూ ఉన్నతాధికారులు తెలిపారు. దీంతో పాటుగా పలు అకాడమిక్ సమస్యలు, విద్యార్థులు లేవనెత్తుతున్న పలు అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని సబ్జెక్టుల్లో సెలబస్ పూర్తి కాలేదన్న విషయమై రిజిస్ట్రార్ ప్రొ. పి. లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొ రెడ్యానాయక్ తదితరులు కారణాలపై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఆరా తీశారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి రాకుండా కేలండర్ ప్రకారమే సెలబస్ పూర్తి చేయడం, పరీక్షల నిర్వహించడం జరగాలని ఈ సందర్భంగా వీసీ రవీందర్ స్పష్టం చేశారు. సాంకేతిక కారణాలతో ఎంసీజే ప్రవేశ పరీక్షను తిరిగి నిర్వహించాలని ఇందుకు సంబంధించిన తేదీని తొందరగా వెల్లడించాలని వీసీ సూచించారు.

### రైతులకు ఎఫ్‌సీఐ అండగా ఉండాలి

రాంగోపాల్‌పేట్: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రైతులకు అండగా ఉండాలని ఎఫ్‌సీఐ తెలంగాణ కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. శనివారం సికింద్రాబాద్‌లోని అలెగ్జాండర్ రోడ్‌లోని ఓ హోటల్‌లో ఎఫ్‌సీఐ తెలంగాణ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను పలువురు ఘనంగా సత్కరించారు. ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అంశాల గురించి, ఎఫ్‌సీఐలో జరుగుతున్న అవినీతి, అవకతవకలపై కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. రైతు శ్రేయస్సు కోసం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత సభ్యులపై ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు సత్యమూర్తి, తిరుపతి, విజేందర్‌రెడ్డి, మహ్మద్ రిజ్వాన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కేశవరావును కలిశారు.

### సెల్లార్‌లోని నీటిని డ్రైనేజీలోకి వదలొద్దు

అమీర్‌పేట: అమీర్‌పేటలోని మెడికవర్ ఆసుపత్రి సెల్లార్‌లో నిలిచిపోయిన నీటిని డ్రైనేజీలోకి వదలడం సరికాదని మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి అన్నారు.శాంతిభాగ్ అపార్ట్‌మెంట్స్ వాసులు ఫిర్యాదు మేరకు శనివారం జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు.సెల్లార్‌లో నిలిచిన నీటిని డ్రైనేజీలోకి వదటం వల్ల సమీపంలోని అపార్ట్‌మెంట్స్‌లోకి డ్రైనేజీ మురుగునీరంతా వెళ్లి ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోయారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని శేషుకుమారి అధికారులను కోరారు. ఇంజనీరింగ్ విభాగం ఏఈ జమీల్, జలమండలి డీజీఎం వంశీకృష్ణ, మేనేజర్ హర్షిణి పాల్గొన్నారు.

### అభ్యంతరాలను 24 వరకు తెలపాలి

లాలాపేట: టీఎస్ సీపీజీఈటీ–2023 వివిధ పీజీ, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికి జూన్ 30 నుంచి జూలై 10వ తేదీ వరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. దీనికి సంబంధించి ప్రవేశ పరీక్షల అన్ని సబ్జెక్టుల ప్రశ్నాపత్రాల జవాబు ప్రాథమిక–కీని శనివారం వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఓయూ అధికారులు తెలిపారు. ప్రిలిమినరీ కీకి సంబంధించి అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో కన్వీనర్ కార్యాలయంలో లేదా ఈ–మెయిల్‌లో ఈ నెల 24 లోపు పంపాలన్నారు.

### రైలులో మహిళ మెడలోంచి గొలుసు చోరీ

సికింద్రాబాద్: అనారోగ్యం కారణంతో చికిత్స కోసం రైలులో నగరానికి వస్తున్న ఓ మహిళ మెడలోంచి మంగళ సూత్రాల బంగారు గొలుసును ఓ అగంతకుడు లాక్కొని పరారయ్యాడు. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన హరినాథ్ భార్య తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం శుక్రవారం అర్ధరాత్రి రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్‌కు బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున సత్తెనపల్లికి స్టేషన్‌కు చేరుకున్న రైలు అక్కడ కాసేపు ఆగింది. రైలు ఆగుతున్న సమయంలోనే కిటికీ వైపు కూర్చున్న హరినాథ్ భార్య బంగారు పుస్తెలతాడును లాక్కున్న ఆగంతకుడు అక్కడి నుంచి ఉడాయించాడు. సికింద్రాబాద్ చేరుకున్న అనంతరం హరినాథ్ ఇక్కడి జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు కేసును విచారణ నిమిత్తం సత్తెనపల్లి జీఆర్పీ పోలీసులకు పంపించారు.

### పారిశుద్ధ్యం పనులకు ప్రాధాన్యం



సికింద్రాబాద్: పారిశుద్ధ్యం పనులు వేగవంతం చేసి సికింద్రాబాద్ ప్రాంత ప్రజలకు ఆరోగ్యకర వాతావరణాన్ని అందివ్వడం కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటానని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుధాంశ్ చెప్పారు. డీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శనివారం తెల్లవారుజామున సర్కిల్ పరిధిలోని అన్ని శానిటేషన్ పాయింట్లను సందర్శించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో అన్ని రహదారులను శుభ్రం చేయించడంలో సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూపర్‌వైజర్లకు సూచించారు. చెత్త తొలగింపు విషయంలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. ఆయన వెంట పారిశుద్ధ్య విభాగం అధికారి జేపీ మాధవి, తదితరులు ఉన్నారు.

### నియామకం

సనత్‌నగర్: టీపీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సనత్‌నగర్‌కు చెందిన ఐవాన్ వాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ విభాగం చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహెల్ శనివారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న ఐవాన్‌వాజ్ సేవలను గుర్తించిన అధిష్ఠానం మైనార్టీ వింగ్ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు.

## కంటోన్మెంట్ విలీనం పక్కా?

**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సెంట్రల్ కమాండ్ పీడీ లేఖ**



కంటోన్మెంట్: దేశ వ్యాప్తంగా ఉన్న 62 కంటోన్మెంట్‌ల పాలనలో మిలటరీ పెత్తనానికి తెరదించుతూ, సమీప మున్సిపాలిటీల్లో కలిపే ప్రక్రియ కొనసాగుతోందని వార్తలు కొన్ని నెలలుగా వెలువడుతున్నాయి. కేంద్రం, మిలటరీ ఉన్నతాధికారులు నుంచి ఎలాంటి స్పష్టత లేకపోయినా తెరవెనుక ప్రక్రియ వేగవంతంగా సాగుతోందనే సమాచారం. దేశ వ్యాప్తంగా ఆయా కంటోన్మెంట్‌ల పరిధిలోని కోటి మందికి పైగా సామాన్య జనంతో పాటు సుమారు 15వేల మంది పర్మినెంట్, 20 వేలకు పైగా బోర్డు ఉద్యోగులు తమ భవితవ్యంపై ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో విలీనానికి సంబంధించి ఏ చిన్న సమాచారం వెలువడినా సోషల్ మీడియా ద్వారా క్షణాల్లో వైరల్ అవుతోంది. శనివారం జార్ఖండ్, బిహార్ ఆర్మీ హెడ్ క్వార్టర్స్ పరిధిలోని సెంట్రల్ కమాండ్ ప్రిన్సిపల్ డైరెక్టర్, దానాపూర్ కంటోన్మెంట్ సీఈఓకు రాసిన లేఖ వైరల్ అయింది. కంటోన్మెంట్‌ల విలీనానికి సంబంధించి కేంద్రం నిర్ణయం తీసుకుందంటూ ఈ లేఖలో పేర్కొనడమే గమనార్హం. ఇప్పటి వరకు ఊహా గానాలే తప్ప, విలీన ప్రక్రియ ముందుకు సాగుతుందంటూ రక్షణ శాఖ ఉన్నతాధికారి తన పరిధిలోని కంటోన్మెంట్ సీఈఓ ఉత్తరం ద్వారా వెల్లడించడం ఇదే మొదటిసారి. దీంతో విలీనంపై కేంద్రం దూకుడుగానే ముందుకు సాగుతోందని, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌పై కూడా ఇలాంటి ప్రకటన కోసం ఎదురుచూస్తున్నామని పలువురు తమ సంబంధీకులకు లేఖ ప్రతిని ఫార్వార్డ్ చేస్తున్నారు. విలీనాన్ని స్వాగతిస్తూ పలువురు హర్షాతిరేకాలు సైతం వ్యక్తం చేస్తున్నారు.

## బీబీఏ–హెల్త్ కేర్ కోర్సుతో ఉపాధి అవకాశాలు

**విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ**


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వాకాటి కరుణ, హెల్త్ కేర్ సెక్టార్ అధికారులు

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, కమిషనర్ కళాశాల విద్య సంయుక్తంగా దోస్త్ ద్వారా డిగ్రీ స్థాయిలో నూతనంగా ప్రవేశపెట్టిన సెక్టార్ స్కిల్ కోర్సుల అమలులో భాగంగా శనివారం బీబీఏ–హెల్త్ కేర్ మెనేజ్‌మెంట్ కోర్సుకు సంబంధించి హెల్త్ కేర్ సెక్టర్ స్కిల్ కౌన్సిల్ (హెచ్ఎస్ఎస్‌సీ) వారితో తెలంగాణ ఉన్నత విద్య, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు త్రైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాలను ఆయా విభాగాల అధికారులు మార్చుకున్నారు. ఆంధ్రమహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఉమెన్స్ కళాశాలలో బీబీఏ–హెల్త్ కేర్ మెనేజ్‌మెంట్ కోర్సుపై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని కళాశాల విద్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ మాట్లాడుతూ.. బీబీఏ–హెల్త్ కేర్ కోర్సు ద్వారా భవిష్యత్‌లో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కోర్సుతో విద్యార్థులకు చక్కని నైపుణ్యాలు అలవడుతాయని, సంస్థలు, వైద్యశాలలో పని చేసిన అనుభవం ద్వారా ఉపాధి పొందుతారన్నారు. ఈ కోర్సులను ఈ విద్యా సంవత్సరం తెలంగాణలో డిగ్రీ స్థాయిలో ప్రవేశపెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఝాన్సీ, సెక్టార్ స్కిల్ కౌన్సిల్ చీఫ్ సుబ్బారావు, హెల్త్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, సీఈఓ ఆశీష్ జైన్, సంబంధిత అధికారులు అనహువర్ణ, పూజ, ప్రొ. జి.యాదగిరి, ప్రొ. డీఎస్ఆర్ రాజేంద్రసింగ్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

సనత్‌నగర్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ఎస్.రంగారావు అన్నారు. బేగంపేటలోని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ఎవరికీ ఎలాంటి హాని ఉండదన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడం బాధాకరమన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలను నడపాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య భారీగా తగ్గిందని ఎన్నో కేసులను ఛేదించడంలో సీసీ కెమెరాలు కీలకంగా వ్యవహరించాయన్న విషయాన్ని గుర్తు చేశారు. బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.. మైనర్లకు వాహనం ఇవ్వడం ద్వారా ఆ వాహనం ఎవరిపై ఉన్నదో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు.



### 19 మందిని రక్షించి.. 10 మందిని అరెస్టు చేసి

**బాల కార్మికులకు విముక్తి**

సికింద్రాబాద్: నగరంలోని కార్మాగారాల్లో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి తరలిస్తున్న బాలలను సికింద్రాబాద్ డివిజనల్ ఆర్పీఎఫ్ పోలీసులు రక్షించి బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఆర్పీఎఫ్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేబశ్మిత చటోపాధ్యాయ బెనర్జీ వివరాల ప్రకారం.. బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి నగరానికి బాలకార్మికులు ఈ నెల 21న దానాపూర్–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయటుదేరినట్లు పోలీసులకు సమాచారం అందగా బచ్‌పన్ బచావో ఆందోళన్ ఎన్జీఓ సంస్థ ప్రతినిధుల సహకారంతో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో దాడులు నిర్వహించి 19 మంది బాలలతో పాటు వారికి అక్రమ రవాణా చేస్తున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అడ్డగుట్ట: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దయాకర్ వివరాల ప్రకారం.. తుకారాంగేట్ మాంగర్ బస్తీ సమీపంలోని కల్లు కాంపౌండ్ వద్ద శనివారం 50–55 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు తెలుపు రంగు షర్ట్, బ్లూ కలర్ రెయిన్ కోట్ ధరించి ఉన్నాడని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### యువకుడి అదృశ్యం


మస్తాన్

అడ్డగుట్ట: తల్లి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ దయాకర్ వివరాల ప్రకారం .. అంబేడ్కర్ నగర్‌కు చెందిన మస్తాన్ (19) చెడు అలవాట్లకు బానిసవ్వడంతో ఈ నెల 20న తల్లి మందలించింది. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మస్తాన్ ఎంతకీ ఇంటికి రాకపోవడంతో శనివారం అతని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.